మీరే అని నమ్ముతున్నాను. నేనూ, నా సన్నిహిత మిత్రుడైన రామ్‌దాసు-ఈ పూటకి ఈ రైలుకి బెర్తులు రిజర్వ్ చేయించుకోగా, 'అతనికి ఈ కంపార్ట్‌మెంట్‌లో 58వ నెంబరు బెర్త్ ఇచ్చి, నాకు వేరే కంపార్ట్‌మెంట్‌లో 57 ఎలాట్ చేసేరు. కొన్ని కారణాల వల్ల మేం ఇద్దరం ఈ ప్రయాణంలో చెప్పుకోవలసిన కబుర్లు కొన్ని ఉన్నాయి గనుక, దయచేసి మీరు నా రిజర్వేషన్ టిక్కెట్టుతో ఆ కంపార్ట్‌మెంట్‌లో 57కి వెళ్లిపోయి నాకు ఈ బెర్తు వదిలిపెట్టమని కోరుతున్నాను." అన్నాడు. మేం ఇద్దరం ఈ సందర్భంగా బోలెడు ఇంగ్లీషు మాట్లాడుకున్నాం. సరేకదా అని నేను కాంప్రమైజ్ అయిపోయి నా టిక్కెట్టు అతనికి ఇచ్చేసి అతని టిక్కెట్టు నేను తీసుకున్నాను. సూట్‌కేసు పుచ్చుకుని లేచి, తెలుగులో 'అయితే, అక్కడ నా పేరేమిటి?' అన్నాను.

అతను నావేపు ఆశ్చర్యంగా చూసి, అరె! మీరు తెలుగువాళ్లేనా; నయం, ఇంతసేపూ ఇంగ్లీషులో మాట్లాడుకున్నామే!' అన్నాడు.

'నా పేరేమిటి, చెప్పండి తొందరగా! బండి బయల్దేరే వేళ అయింది' అన్నాను.

అతను హాయిగా నవ్వి "మీ పేరు అశ్వినీకుమార్ దత్తు" అన్నాడు,

★

# 30. ఖాళీలను పూరింపకుము

"**ఖాళీలను** పూరింపుము" (ఫిలప్ ది బ్లాంక్స్)అనే రకం ప్రశ్న ఒకటి ఇచ్చి; దానికింద ఎ.బి.సి.డి. ఇలాగ బిట్లు ఏర్పరచి ప్రశ్న అంటూ అడక్కుండా సమాధానం రాబట్టే పద్ధతి మన విద్యావిధానంలో అత్యంతమిక్కిలి పురాతనమైనది. రాముని భార్య..... సుగ్రీవునికిని, వాలికిని......వలన వైరము కలిగెను. అశోకుడు......వేయించెను. ఈ మూడు సింపులు బ్లాంక్సులూ "ద్రౌపది", "మండోదరి" "వంకాయ ముక్కలు" అని నింపితే మార్కులు రావు కదా. అలా తప్పుగా నింపిన వాళ్లని, అసలు బ్లాంకుల కొశ్చన్లు ఆన్సర్ చెయ్యని వాళ్లని నిర్దాక్షిణ్యంగా పరీక్ష ఫేల్ చేసేసి కింది క్లాసులో మరొక యాడాది చదివించెయ్యాలని మా నాన్నగారు అంటూ వుండేవారు. బిట్టు కొశ్చన్లలో ఇచ్చే ఆన్సర్లు నాలుగింట్లో ఒకటి టిక్కు పెట్టే సంస్కృతి ఆయనకి తెలిస్తే ఇంకా ఏం అనేవారో, మరి!

నేను స్కూలు ఫైనలు పరీక్షరాయగానే నాకు విజయనగరం కో-ఆపరేటివ్ బాంక్‌లో చిన్న ఉద్యోగం ఒకటి వచ్చింది. ఖాతాదార్లు బ్యాంకుకి డబ్బు కట్టడం, తీసుకోవడం, చెక్కులో, డ్రాఫ్ట్‌లో అడగడం యిలాటి పనుల మీద వొచ్చేవాళ్లు. ఈ పనులన్నిటికీ దరఖాస్తులు అచ్చువి ఉంటాయి. ఖాతాదారు పేరు, ఖాతా సంఖ్య, లెడ్జరు ఫోలియో నెంబరు, సొమ్ము, తేది ఇటువంటివి బ్లాంకుగా వుంచేసి మిగిలిన వన్నీ అచ్చువేసి ఉంటాయి ఆ ఫారాల్లో. నా పని ఏమిటంటే అట్టే చదువురాని - ఖాతాదార్లు వచ్చినపుడు వాళ్లు ఏ పని మీద బ్యాంకుకి వచ్చేరో తెలుగులో అడిగి; దానికి తగిన ఫారం తీసి బ్లాంకులన్నీ నింపి వాళ్ల సంతకాలో, వేలిముద్రలో తీసుకుని వాళ్లని క్యాష్ కౌంటర్‌కి పంపడం. దీనికి నెలకి ఇరవై రెండు రూపాయలు ఇచ్చేవారు. (ఇది 1946. బస్తా బియ్యం 22 రూపాయలకి వొచ్చే రోజులు)

ఒకానొక ఖాతాదారు తనకి ఎక్కణ్ణించో వొచ్చిన చెక్కు నాకిచ్చి; అందులో ఉదహరించిన

సొమ్మును తనకి ఈ బ్యాంకులో ఉన్న ఖాతాలో జమ చేయించమన్నాడు. ఈ పనికి ఆ రోజుల్లో రెండు ఫారాలుండేవి. ఒకటి:- చెక్కును డబ్బుగా మార్చమనే దరఖాస్తు; రెండోది:- ఆ డబ్బును తన ఖాతాలో వెయ్యమని అడిగే దరఖాస్తు. రెండింటికీ ఖాతాదారుకి కాపీలివ్వాలి. కార్బన్‌తో రాయడానికి వీల్లేదు. అంచేత మొత్తం నాలుగు ఫారాలు (అంటే నాలుగు ఫారాల్లో బ్లాంకులు) నింపవలసొచ్చింది. మూడు సమంగానే రాసేను. కాని నాలుగో దాంట్లో నాకు తెలీకుండా ఒక తప్పు దొర్లిపోయింది. అంతే. నన్ను స్కూల్ ఫైనలు క్లాసు మళ్లా చదవమనలేదు గాని, నా (నెలకి బస్తా బియ్యం) ఉద్యోగం వూడిపోయింది.

"నువ్వెంత వెర్రి వెధవ్వి కాకపోతే అచ్చువేసిన ఫారంలో బ్లాంకులు నింపడం కూడా చేతకాకుండా పోతుంది!" అని మా నాన్నగారు నన్ను తిట్టేరు. తిడితే తిట్టేరు గాని "ఇంక నీ మొహానికి ఇప్పుడప్పుడే ఉద్యోగం అచ్చిరాదు గానీ, బి.ఏ దాకా చదువు; ఏడుస్తూ" అని నన్ను కాలేజీలో చేర్చేరాయన.

మళ్లీ బి.ఏ పాసయ్యాక సబ్ కలెక్టర్‌గారి అధ్వర్యంలో జనాభా లెక్కల సార్టింగ్ అండ్ టేబ్యులేషన్ ఆఫీసులో ఉద్యోగం వొచ్చింది. నా ఖర్మ ఏమిటో గాని ఇక్కడ కూడా అన్నీ ఫారాలే; అన్నీ బ్లాంకులే. "సెన్సస్ స్లిప్పు" అంటారు ఆ ఫారాన్ని. ఒక్కొక్క మనిషి వివరాలు ఒక్కొక్క స్లిప్పులో కొన్ని కోడ్ నెంబర్లలో బంధిస్తారు. ఇందులో కూడా; ఒక గ్రామం జనాభా మొత్తం 1265 అనే స్టేటుమెంటు ముందుగా వెళ్లిపోయాక; ఆ వూళ్లో పురుషులు 621, స్త్రీలు 644 అని కిట్టించినా; మొత్తం విద్యావంతులు 127 అనీ, అందులో స్త్రీలు 66, పురుషులు 84 అనీ, ఎలిమెంటరీ స్టడీ 47 స్కూల్ ఫైనల్‌కి పైబడి 84 అనీ ఇలా ఏవో అంకెలు పడిపోయి రెండోసారి నా ఉద్యోగం వూడింది.

అందువల్ల ఫారాలు నింపడంతో గడిచిపోయే ఉద్యోగాలు (అనగా రైల్వే, పోస్టల్, బాంక్ లాంటి సర్వీసులు) జోలికిపోకుండా స్వతంత్రంగా ఆలోచించి రిపోర్టులూ, లెటర్సులూ, ప్లాన్సులూ తయారుచేసి నిర్వహించే ఉద్యోగాన్నే నేను చేసేను.

"ఒరే గోపాలా, ఎవడ్రా వీడు; అచ్చుఫారంలో నాలుగు బ్లాంకులుంటే నాలుగూ కూడా నింపకుండా సంతకం పెట్టేసి పంపించేసేడు?" అని నిన్న మధ్యాహ్నం మూడింటికి నేనింటి కొచ్చేసరికి నాకొక ఉత్తరం అందించేరు మా నాన్నగారు.

కాగితం చూసిన పది సెకండ్లలో నాకది అర్థమైపోయింది. "ఇదా, నాన్నారూ? మన ఇంట్లో టెలిఫోను పెట్టమని అప్లికేషను పెట్టేను కదా? దాని తాలూకు ఇంటిమేషన్" అన్నాను.

"ఏం ఇంటిమేషను; ఇది? మీ అప్లికేషన్ నెంబరు - అని నెంబరు మాత్రం బ్రహ్మారాతతో రాశాడు. మీ ఏరియాలో ఈ సేవలు అందిస్తున్నవారు......... మీకన్నా ముందు......... అప్లికేషన్లు మా దగ్గర పరిశీలిన నిమిత్తం ఉన్నాయి. వాటిల్లో .........వరకు పరిశీలించడమైనది. మీకు టెలిఫోన్ ఇచ్చేసరికి ..........కాలం పట్టవచ్చు. మీరు మాకు ఇక మీదట పంపుకునే విన్నపాల్లో పై నెంబరు తప్పక ఉదహరించవలెను. ఇందులో ఆ అధికారి మనకి నెంబరు తప్పితే ఏమిటి చెప్పినట్టు?" అని మా నాన్నగారు నా మీద ఆగ్రహించేరు. "అసలు టెలిఫోన్ అనేది ప్రభుత్వం ప్రజలకి అందించే సేవ. యంత్రం మనకి అందుబాటులో ఉంచడానికి, వైర్లూ, స్తంభాలూ

బిల్లులూ వెయ్యడానికి, కొంత సామగ్రీ మానవశక్తీ అవసరం కాబట్టి దానికి తగిన విధంగా రుసుము నిర్ణయించొచ్చు. ట్రంకాల్ చేస్తే లైన్లు ఖాళీ లేవని గంటల తరబడి గడిపేడం; బిల్లులు వెయ్యడంలో విపరీతమైన పొరపాట్లు చేసి నీ బాబుతో చెప్పుకో అనడం; ఓ ఇద్దరు మాటాడుకుంటుండగా మధ్యలో ఎవడో దూరిపోతే ఏమీ చెయ్యలేకపోడం లాంటి అసమర్థపు సేవలు చేస్తూ కూడా ఏడాదికోసారి బడ్జెట్ సీజన్‌లో సిగరెట్ల ధరలూ, సబ్బుల ధరలూ పెంచీసినట్టు లాభాల కోసం టెలిఫోన్ ఛార్జీలు పెంచీడమా, సేవ అంటేను?'' మిగతా దేశాల్లో ప్రయివేటు కంపెనీలు ఎంతో సమర్థంగా, ఎంతో భయభక్తుల్తో అందించే ఈ "సేవ'' ఈ దేశంలో ఇంత హీనంగా చేస్తారేం? అని లెక్చరిచ్చారు మా నాన్నగారు.

"సరే లెండి; నేనిప్పుడే మామయ్యగారింటికెళ్లి ఆ అధికారికి ఫోన్ చేసి కనుక్కొస్తాను'' అన్నాను.

"నేనూ వస్తాను పద.'' అని ఆయన కూడా బయలుదేరేరు. మామయ్య ఇంట్లో టెలిఫోన్ ఎక్స్‌టెన్షన్‌తో సహా ఉంది. నేను ఫోన్ చేసి ఆ అధికారి గార్ని పట్టుకునే సరికి నాన్నగారు ఎక్స్‌టెన్షన్ ఫోన్ ఎత్తి మా మాటలు వినడం మొదలెట్టేరు.

"నమస్కారం. టెలిఫోన్స్ డిపార్ట్‌మెంట్ ఇంజనీరింగ్ ఆఫీసర్ అంబాసహిత శాస్త్రిని మాట్లాడుతున్నాను!''

"అయ్యో; పెద్దలు; మీరు మాకు నమస్కారం ఏమిటి సార్; మేమే మీకు నమస్కారం అనాలి. సారీ'' అన్నాను.

"ఏం ఫర్వాలేదు; చెప్పండి''

"నేను టెలిఫోన్ కావాలని దరఖాస్తు పెట్టి వెయ్యి రూపాయలు రిజిస్ట్రేషన్ డిపాజిట్ కట్టేను. మీ నుంచి నాకొక ఉత్తరం వచ్చింది.''

"నెంబరు?''

చెప్పేను.

"అయితే ఇప్పుడేమంటారు?'' అన్నారాయన.

"మీరు నాకు పంపిన అచ్చుఫారం లెటరులో నాలుగు బ్లాంకులు ఉన్నాయి. మా ఏరియాకి సేవలందించే వారు; మొత్తం పెండింగు అప్లికేషన్లు, అందులో పరిశీలన పూర్తయినవి; చివరిగా, మాకు టెలిఫోను రావడానికి పట్టే కాలం. ఈ నాలుగు బ్లాంకులూ నింపకుండా ఆ ఉత్తరం రావడాన్నించి మాకు సంగతేమిటో బోధపడక గాభరాగా ఉందండీ!''

"అదా! అది ఏదో పాత ఫారం. రొటీన్‌లో పంపేశాం. అంచేత బ్లాంకులు నింపలేదు.''

వెయ్యి రూపాయలు డిపాజిట్ తీసుకుని పాత ఫారం ఎందుకు వాడాలి? కొత్తది ఎందుకు రాలేదుట? - అని మా నాన్నగారు నన్ను దబాయిస్తున్నారు; పక్కనించి.

"ఓహో అలా గాండీ? పోనీ, మాకు ఫోన్ ఎప్పుడొస్తుందో కనీసం అంచనాగా చెప్పగలరండీ?''

"దేవుడు కూడా ఆ సంగతి చెప్పలేడు.''

"అయ్యో! అలాగా? మరి క్రమం తప్పకుండా రాజకీయ నాయకులూ సీనియర్ అధికార్లూ

ఇన్ని లక్షల టెలిఫోన్లు ఇచ్చేస్తున్నాం; ఇన్ని కోట్ల లైన్లు ఒచ్చేస్తున్నాయని పేపర్లలో స్టేట్ మెంట్లిస్తూంటారు కదా; అదంతా వట్టిదేనా? పోనీ నన్నొకసారి తమ దర్శనానికి రమ్మంటా రేమిటి?''

''అక్కర్లేదు. మీరు మాకేదైనా లెటర్ రాస్తే మీ నెంబరు మాత్రం తప్పకుండా ఉదహరించాలి. అంతే.''

''థాంక్యూ సార్. ఉంటానండి'' అని ఫోన్ పెట్టేశాను.

మా నాన్నగారి మొహం బందరు ఉల్లిపాయలాగ ఎర్రగా అయిపోయింది. ఎక్స్‌టెన్షన్ ఫోన్ దింపేసి అన్నారు. ''నీ మొహానికి టెలిఫోనొకటి తక్కువైంది! బుద్ధి తెచ్చుకుని ఇంటికి నడు!''

బ్లాంకులు ఫిలప్ చెయ్యని ఆ అధికారిని మళ్లా పదో క్లాసు చదవమనకుండా నామీద చిరాకు పడ్డంతో సరిపుచ్చుకున్న మా నాన్నగార్ని మనసులోనే అభినందించుకున్నాను. ★

# 31. విషపుత్రికలు

మర్చంట్ నేవీలో పనిచేస్తున్న మా దొడ్డమ్మ కొడుకు ''సుబ్బు'' మొన్న ఒకటో తారీఖున ఆర్నెల్ల తరువాత ఇంటికొచ్చాడు. ఇలా ఆరేసి నెలలు నౌకలమీద ఉండి విదేశాలు చక్కబెడుతూ పదిహేనేసి రోజులు ఇంటి దగ్గర గడపడం మా సుబ్బుకి ఇరవై ఏళ్లనించీ పరిపాటే. ఈ సారి ఇంటికి రాగానే మా మరదలు, ''పిల్లలిద్దరూ పరీక్షలు ఫేలయ్యారు'' అన్నవార్త చెవిన వేసి ''ఓ యేడాది వెనకబడితే పడ్డారుగానీ వాళ్లిద్దరూ ఇప్పుడైనా ఒకదార్ని పడేటట్టు చూసి మరీ వెళ్లండీ, దేశాలమీదికి!'' అని హెచ్చరించినట్టుంది. సుబ్బు ఎవర్నో బెత్తాయించి తన కారు ఇచ్చి నన్ను తీసుకురమ్మన్నాడు.

''మా కుర్రాళ్లిద్దరూ పరీక్ష ఫేలయ్యారట, నీకు తెలీదా?''

''అవునట; మా అమ్మాయి చెప్పింది!''

''నేను ఉద్యోగరీత్యా దేశాలు పట్టిపోయినా నువ్వు కూతవేటు దూరంలో ఉన్నావన్న ధైర్యంతోనే కదా, వెళ్తున్నాను! నువ్వు ఉండికూడా ఇలా అయిందేమిటా అని బాధగా ఉందన్నయ్యా!''

నేను ప్రతీరోజూ, ఆఫీసుకి వెళ్లేటప్పుడూ ఆఫీసునించి ఒచ్చేటప్పుడూ కూడా మీ ఇంటికొచ్చి వాళ్ల చదువుల సంగతి ఎలా ఉందని అడిగే వెళ్తున్నాను. ఔనో కాదో మా మరదల్ని అడుగు, లేకపోతే నీ కొడుకుల్ని అడుగు'' అన్నాను.

''పిలు, వాళ్లిద్దర్నీ!'' అన్నాడు సుబ్బు; మా మరదలు సీతతో.

''సుబ్బు'' ఇల్లు చాలా పెద్దది. కింద భాగంలో పెద్దహాలు. దాన్ని అనుసరించి రెండు బెడ్‌రూమ్‌లు వాటికి ఎటాచ్‌డ్ బాత్‌రూమ్‌లూ. ఆ రెండు బెడ్ రూమ్‌లకీ మధ్య స్టోర్ రూమ్-కమ్-బార్. హాలుకి మధ్యగా గొప్ప ఆర్టిస్టిక్‌గా కట్టిన మేడమెట్ల వరస; ఆ తరువాత డైనింగ్